బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరాలి

- రోజూ 2.24 లక్షల టన్నులు తీయాలి
- సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): బొగ్గు ఉత్పత్తిలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ సూచించారు. సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా శుక్రవారం సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యం 70 మిలియన్ టన్నులను చేరుకోవాలంటే, ప్రతిరోజూ 2.24 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి, రవాణా చేయాలని బలరామ్ సూచించారు. గతేడాదితో పోల్చితే ఈయేడు మొదటి 9 నెలల కాలంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ తొలగింపు ఆశాజనకంగా ఉన్నాయని అన్నారు. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని చెప్పారు. కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి ఎదురవుతున్న అవాంతరాలను అడిగి తెలుసుకున్నారు. ఒడిశాలోని నైనీలో చేపట్టిన బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తిని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేందుకు ఆ రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డిప్యూటీ సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని, త్వరలో ఆయన నేతృత్వంలో సింగరేణి అధికారుల బృందం ఆ రాష్ట్రంలో పర్యటిస్తుందని వెల్లడించారు. ఈ సమీక్షలో డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు, ఎన్వీకే శ్రీనివాస్, జీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈడీ జే ఆల్విన్, జీఎంలు సురేష్, జక్కుల రమేశ్, మల్లెల సుబ్బారావు, జీ దేవేందర్, సూర్యనారాయణతోపాటు అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలు పాల్గొన్నారు.

ఈసారి జీడీపీ 7.3%!

కేంద్ర ప్రభుత్వం అంచనా

న్యూఢిల్లీ, జనవరి 5: దేశ జీడీపీ ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) 7.3 శాతం వృద్ధిని సాధించగలదని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను భారత ఆర్థిక వ్యవస్థపై శుక్రవారం జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తమ తొలి ముందస్తు అంచనాను వెలిబుచ్చింది. ఈసారి గనులు-త్రవ్వకాలు, తయారీ, ఇతరత్రా సేవా రంగాల ప్రదర్శన బాగుందన్నది. ఈ క్రమంలోనే తయారీ రంగంలో 6.5 శాతానికి, గనుల రంగంలో 8.1 శాతానికి ఉత్పాదకత పెరగవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23) ఇవి 1.3 శాతం, 4.1 శాతమేనని గుర్తుచేసింది. ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసెస్ కూడా ఈసారి 8.9 శాతం వృద్ధిని అందుకోవచ్చని, పోయినసారి 7.1 శాతానికే పరిమితమయ్యాయని చెప్పింది. నాడు దేశ జీడీపీ 7.2 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. ఇది లావుంటే 2011-12 ధరల ప్రకారం దేశ జీడీపీ విలువ 2023-24లో రూ.171.79 లక్షల కోట్లుగా ఉండొచ్చని ఎన్ఎస్ఓ అంచనా వేసింది. ఈ క్రమంలోనే వృద్ధిని 7.3 శాతంగా అంచనా వేస్తున్నట్టు పేర్కొన్నది. కాగా, ఈసారి దేశ జీడీపీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 7 శాతంగానే అంచనా వేసిన సంగతి విదితమే.

ఈ ఏడాది 6.2 శాతం

ఈ ఏడాది (2024) భారత జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతంగా నమోదు కావచ్చని ఐక్యరాజ్య సమితి (యూఎన్) అంచనా వేసింది. తయారీ, సేవా రంగాల్లో బలమైన వృద్ధికి తోడు దేశీయ మార్కెట్‌లో భారీ ఎత్తున పెరిగిన డిమాండ్.. ఇండియన్ ఎకానమీకి కలిసొస్తుందన్న అభిప్రాయాన్ని యూఎన్ తమ తాజా వరల్డ్ ఎకనామిక్ సిచ్యుయేషన్ అండ్ ప్రాస్పెక్ట్స్ రిపోర్టు 2024లో వ్యక్తం చేసింది. అలాగే 2025లో దేశ జీడీపీ 6.6 శాతానికి పెరగవచ్చన్నది. ఇక దక్షిణాసియాలో జీడీపీ వృద్ధి 5.2 శాతంగా ఉండొచ్చన్నది. భారత్‌లోని ఆశాజనక పరిస్థితులు ఇందుకు దోహదం చేస్తాయని పేర్కొన్నది. కాగా, గత ఏడాది భారత్‌లో పెట్టుబడులు ఆకట్టుకున్నాయని ఈ సందర్భంగా నివేదికలో ఐక్యరాజ్య సమితి తెలిపింది.

అదానీయే టాప్

97.6 బిలియన్ డాలర్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతుడిగా రికార్డు

Bloomberg Billionaires Index

ఆసియాలోనూ అగ్రస్థానం • రెండో స్థానంలోకి ముకేశ్ అంబానీ

బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజా జాబితా

న్యూఢిల్లీ, జనవరి 5: అదానీ గ్రూప్ సంస్థల అధినేత గౌతమ్ అదానీ మళ్లీ దేశంలోనే అత్యంత ధనవంతుడిగా అవతరించారు. ఏడాది క్రితం ఇదే నెలలో వచ్చిన హిండెన్‌బర్గ్ రిపోర్టుతో ఆవిరైపోయిన అదానీ సంపద.. తిరిగి పుంజుకున్నది. ఈ క్రమంలోనే ఇన్నాళ్లూ భారతీయ శ్రీమంతుడిగా కొనసాగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి మరోసారి అదానీ అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజా జాబితా ప్రకారం అదానీ సంపద 97.6 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ముకేశ్ అంబానీ 97 బిలియన్ డాలర్లతో తర్వాతి స్థానంలో ఉన్నారు. దీంతో భారత్‌లో నేగాక, ఆసియా దేశాల్లోనూ అపర కుబేరుడు గౌతమ్ అదానీయేనని తేలింది.

ప్రపంచ కుబేరుల్లో..

ప్రపంచ శ్రీమంతుల ర్యాంకుల్లో అదానీ 12వ స్థానంలో ఉన్నారు. ముకేశ్ 13వ స్థానంలో ఉన్నట్టు బ్లూంబర్గ్ తెలిపింది. గత నెల విడుదల చేసిన జాబితాలో అంబానీ 14వ స్థానంలో ఉంటే, అదానీ 15వ స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. హిండెన్‌బర్గ్ కేసులో సెబీ దర్యాప్తును సుప్రీం కోర్టు సమర్థించిన నేపథ్యంలో అదానీ సంపద ఒక్క రోజులోనే 7.7 బిలియన్ డాలర్లు ఎగబాకడం గమనార్హం. ఇదే ముకేశ్‌ను దాటి అదానీని నెంబర్ 1ను చేసింది. ఇక ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా గౌతమ్ అదానీ సంపద 13.3 బిలియన్ డాలర్లు ఎగబాకింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్లను కొనేందుకు మదుపరులు పోటీ పడ్డారు. హిండెన్‌బర్గ్ నివేదికకు ముందు భారతీయ అపర కుబేరుడిగా అదానీ వెలుగొందిన సంగతి విదితమే. ఇక ఒకానొక దశలోనైతే అదానీ సంపద 150 బిలియన్ డాలర్లను తాకింది. ఈ సమయంలోనే టాప్-3 ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా అదానీ రికార్డు సృష్టించారు. అయితే హిండెన్‌బర్గ్ చేసిన అవినీతి, అక్రమాల ఆరోపణలతో ఏకంగా 85 శాతం మార్కెట్ విలువను అదానీ గ్రూప్ కోల్పోవాల్సి వచ్చింది. ఫలితంగా అదానీ వ్యక్తిగత సంపద సైతం దారుణంగా పడిపోయింది.

ఇతరుల్లో..

ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా ముకేశ్ అంబానీ సంపద 665 మిలియన్ డాలర్లు ఎగిసింది. అలాగే తాజా జాబితా టాప్-50లో ఉన్న భారతీయుల విషయానికొస్తే.. 34.6 బిలియన్ డాలర్ల సంపదతో షాపూర్ మిస్త్రీ 38వ స్థానంలో, 33 బిలియన్ డాలర్లతో శివ్ నాడార్ 44వ స్థానంలో ఉన్నారు. కాగా, అదానీ గ్రూప్ సంస్థల్లో అత్యంత ప్రధానమైన అదానీ ఎంటర్‌ప్రైజెస్ రెవెన్యూ గత ఆర్థిక సంవత్సరం (2022-23) 17 బిలియన్ డాలర్లు పెరిగినట్టు బ్లూంబర్గ్ తెలిపింది. దేశీయ స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్‌నకు చెందిన 9 సంస్థలు ట్రేడ్ అవుతున్నది తెలిసిందే.

పెరిగిన ఫారెక్స్ రిజర్వులు

ముంబై, జనవరి 5: విదేశీ మారకం నిల్వలు మరింత పెరిగాయి. డిసెంబర్ 29తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.759 బిలియన్ డాలర్లు పెరిగి 623.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 4.471 బిలియన్ డాలర్లు మేర పెరిగిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ పెరగడం వల్లనే రిజర్వులు అధికమయ్యాయని తెలిపింది. గత వారంలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 1.869 బిలియన్ డాలర్లు అధికమై 551.615 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అలాగే బంగారం రిజర్వులు 853 మిలియన్ డాలర్లు ఎగబాకి 48.328 బిలియన్ డాలర్లకు చేరాయి.

టయోటా వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ, జనవరి 5: వాహన ధరలను 2.5 శాతం వరకు పెంచుతున్నట్టు టయోటా కిర్లోస్కర్ ప్రకటించింది. ఎంపిక చేసిన మాడళ్ల ధరలను ఈ నెల 1 నుంచే పెంచినట్లు సంస్థ వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. దీంతో కస్టమర్లపై కొంత మేర ప్రభావం చూపనున్నదని పేర్కొంది. ఇప్పటికే పలు ఆటోమొబైల్ సంస్థలు మారుతి, హ్యుందాయ్, టాటా మోటర్స్, మహీంద్రా, హోండా, ఫోక్స్‌వ్యాగన్, స్కోడా, ఆడీ, బీఎండబ్ల్యూలు వాహన ధరలను పెంచుతున్నట్టు ప్రకటించాయి.

మళ్లీ 72 వేలపైకి సెన్సెక్స్

వరుసగా రెండోరోజూ లాభపడిన సూచీలు

ముంబై, జనవరి 5: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిశాయి. ఐటీ, టెక్నాలజీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం సూచీలకు కలిసొచ్చింది. ప్రారంభంలో తీవ్ర ఒత్తిడికి గురైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సంకేతాలతో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫలితంగా వారాంతం మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 178.58 పాయింట్లు అందుకొని 72,026.15 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 52.20 పాయింట్లు పెరిగి 21,710.80 వద్ద స్థిరపడింది. వారాంతం ట్రేడింగ్‌లో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు గురయ్యాయని, ఒక దశలో నష్టాల్లోకి జారుకున్న ఇరు సూచీలు చివర్లో కోలుకున్నాయని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు.

- టీసీఎస్ 1.93 శాతం, ఎల్‌అండ్‌టీ 1.62 శాతం, ఇన్ఫోసిస్ 1.37 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.16 శాతం, హెచ్‌యూఎల్ 1.08 శాతం చొప్పున బలపడ్డాయి.
- వీటితోపాటు విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఇదే సమయంలో నెస్లే, సన్‌ఫార్మా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, కొటక్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎన్‌టీపీసీ, టాటా మోటర్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్, ఐటీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టైటాన్, ఎయిర్‌టెల్, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్ షేర్లు నష్టపోయాయి.
- మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 214.11 పాయింట్లు, నిఫ్టీ 20.6 పాయింట్ల చొప్పున అధికమయ్యాయి.
- రంగాలవారీగా చూస్తే ఐటీ సూచీ 1.28 శాతం అధికమవగా, క్యాపిటల్ గూడ్స్ 1.27 శాతం, టెక్ 1.03 శాతం, ఇండస్ట్రీయల్స్, టెలికమ్యూనికేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, కమోడిటీస్, కన్జ్యూమర్ డ్యూరబుల్, మెటల్ రంగ షేర్లు పడిపోయాయి.

ఐపీవోకి మొబిక్విక్

న్యూఢిల్లీ, జనవరి 5: ప్రముఖ ఫిన్‌టెక్ సేవల సంస్థ మొబిక్విక్ మళ్లీ ఐపీవోకి రాబోతున్నట్లు ప్రకటించింది. రెండేండ్ల క్రితం ఐపీవోకి వస్తున్నట్లు ప్రకటించిన సంస్థ..మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉండటంతో వెనక్కి తగ్గింది. మళ్లీ ఇప్పుడు రూ.700 కోట్ల నిధుల సేకరించాలనే ఉద్దేశంతో స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది కూడా. జూలై 2021లో రూ.1,900 కోట్ల ఐపీవోకి వస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇలా సేకరించిన నిధుల్లో ఆర్థిక సేవలు, పేమెంట్ సర్వీసుల బిజినెస్‌ను విస్తరించడానికి వినియోగించనున్నట్లు ప్రకటించింది.

టాప్‌గేర్‌లో ఈవీ విక్రయాలు

2032 నాటికి సగటున 35 శాతం వృద్ధి
2.7 కోట్ల యూనిట్లకు చేరుకోవచ్చు: సర్వే

ముంబై, జనవరి 5: దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. గరిష్ఠ స్థాయిలోనే ఇంధన ధరలు కొనసాగుతుండటంతో ఈవీల వైపు కొనుగోలు దారులు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా గత కొన్నేండ్లుగా దేశీయ రోడ్లపై టాప్‌గేర్‌లో దూసుకుపోయిన పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఈవీలు రాజ్యమేలుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల అత్యధికంగా ఈవీలు తిరుగుతున్నాయి. వచ్చే పదేండ్లకాలంలో సగటున 35 శాతం వృద్ధితో ఈవీల విక్రయాలు 2.72 కోట్లకు చేరుకోనున్నట్లు ఓ సర్వే అంచనావేస్తున్నది. 'ఇండియన్ ఎలక్ట్రిక్ వాహన మార్కెట్ ఓవర్‌వ్యూ 2023' పేరుతో విడుదల చేసిన నివేదికలో కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ పేర్కొంది. 2023లో దేశీయంగా 17 లక్షల వాహనాలు అమ్ముడయ్యాయి.

ఈవీల కోసం ప్రత్యేక స్కీం

ఈవీలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఫేమ్ స్కీంలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలి విడుత విడుదల చేసిన ఫేమ్-1 స్కీం కింద కొనుగోలు చేసే వాహనాలపై భారీగా రాయితీ ఇచ్చిన విషయం తెలిసిందే. రెండో విడుత కూడా రాయితీల్లో కోత విధించినప్పటికీ అమ్మకాలు మాత్రం దూసుకుపోయాయి. గత కొన్నేండ్లుగా సరాసరిగా రెండంకెల వృద్ధిని నమోదు చేసుకుంటున్నాయని, ఇదే క్రమంలో 2032 నాటికి 35 శాతం వృద్ధితో 2.72 కోట్ల విక్రయాలు జరగనున్నాయని నివేదిక అంచనావేస్తున్నది. ఈవీలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 1.2 బిలియన్ డాలర్లను సబ్సిడీల రూపంలో అంద చేసింది. అలాగే 3.5 బిలియన్ డాలర్లతో ప్రొడక్షన్-లింక్డ్ ఇన్సెంటివ్(పీఎల్ఐ) స్కీంను కూడా తీసుకొచ్చింది. ఈవీలను తయారు చేస్తున్న ఆటోమొబైల్ సంస్థలు, విడిభాగాలు తీర్చిదిద్దుతున్న సంస్థలకు ఆర్థిక సహాయం అందించేందుకోసం ఈ స్కీంను అందుబాటులో తీసుకొచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వాలు సైతం..

కాలుష్యాన్ని నియంత్రించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుంబిగించాయి. ఇప్పటికే పలు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వాలను ఈవీలను ప్రోత్సహించడానికి ప్రత్యేక పాలసీలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చాయి కూడా. తెలంగాణతోపాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఒక అడుగు ముందుకేసి రాయితీలు కూడా అందిస్తున్నాయి.

'ఈవీలను ప్రోత్సహించడానికి పాలసీలు, ఆర్థిక రాయితీలతో అమ్మకాలు విరివిగా పెరిగాయి. ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలు కల్పించడం, ముఖ్యంగా చార్జింగ్ కోసం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తుండటం విక్రయాలకు దన్నుగా నిలువనున్నాయి.

- రాహుల్ వాలావాల్కర్, ఇండియా ఎనర్జీ స్టోరేజ్ ఫోండర్

టాటా నుంచి 5 ఈవీలు

దేశవ్యాప్తంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో టాటా గ్రూపునకు చెందిన టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మరిన్ని వాహనాలను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే ఏడాదిన్నరలోగా ఐదు నూతన ఉత్పత్తులను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. తన తొలి ఈవీ ఎస్‌యూవీ పంచ్ 'యాక్టి-ఈవీ' రూ.21 వేలు చెల్లించి ముందస్తు బుకింగ్‌లను సంస్థ శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ చీఫ్ ప్రొడక్ట్స్ అధికారి ఆనంద్ కులకర్ణి మాట్లాడుతూ..ప్రతి మూడు నెలలకొక వాహనం చొప్పున వచ్చే ఏడాదిన్నరలోగా ఐదు నయా ఎలక్ట్రిక్ కార్లను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. 300 కిలోమీటర్ల నుంచి 600 కిలోమీటర్ల రేంజ్‌లో వీటిని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఫ్యూర్ ఈవీ ప్లాట్‌ఫామ్‌లో 7.2 కిలోవాట్ల నుంచి 11 కిలోవాట్ల చార్జర్లు కలిగిన మాడళ్లను తయారు చేస్తున్నది.

నియామకాల్లో 8 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 5: జాబ్ మార్కెట్ కోలుకుంటున్న నేపథ్యంలో ప్రస్తుత 2024 సంవత్సరంలో దేశీయంగా నియామకాలు 8.3 శాతం పెరుగుతాయని ఫౌండిట్ యాన్యువల్ ట్రెండ్స్ తాజా రిపోర్ట్‌లో తెలిపింది. 2023లో నియామకాలు 2022తో పోలిస్తే 5 శాతం క్షీణించగా, చివరినెలైనా డిసెంబర్‌లో మాత్రం 2 శాతం వృద్ధిచెందాయి. ప్రస్తుత ఏడాది తయారీ, బీఎఫ్ఎస్ఐ, ఆటోమోటివ్, రిటైల్, ట్రావెల్, టూరిజంతో సహా కీలక రంగాల్లో నియామకాల వృద్ధి ఉంటుందని ఫౌండిట్ వివరించింది. కొన్ని రంగాల్లో గణనీయమైన వృద్ధి కన్పిస్తున్నదని, ముఖ్యంగా షిప్పింగ్ పరిశ్రమలో నియామకాలు 28 శాతం పెరిగాయన్నది. రిటైల్, ట్రావెల్, టూరిజం రంగాల్లో 25 శాతం, అడ్వర్‌టైజింగ్, మార్కెట్ రీసెర్చ్, పబ్లిక్ రిలేషన్స్ రంగంలో 18 శాతం చొప్పున నియామకాలు అధికమయ్యాయని వివరించింది. ఐటీ రంగంలో ఉద్యోగ నియామకాలు జాప్యం కావచ్చని, అయితే ఆర్టిఫిషీయల్ ఇంటిలిజెన్స్, డాటా సైన్స్, సైబర్‌సెక్యూరిటీ నిపుణులకు డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపింది.

బ్రూక్‌ఫీల్డ్ చేతికి ఏటీసీ ఇండియా

న్యూఢిల్లీ, జనవరి 5: కెనడాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్.. భారత్‌లోని అమెరికన్ టవర్ కార్పొరేషన్ (ఏటీసీ) వ్యాపారాన్ని చేజిక్కించుకుంటున్నది. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి టికింగ్ ఫీతో కలిసి ఏటీసీ ఇండియా విలువను 2 బిలియన్ డాలర్లు (రూ.16,500 కోట్లు)గా పరిగణించి జరుగుతున్న ఈ మెగా డీల్ మొత్తం వాల్యూ దాదాపు రూ.21వేల కోట్లు (2.5 బిలియన్ డాలర్లు) కావడం విశేషం. ఇక నగదు లావాదేవీల్లో జరుగబోయే ఈ డీల్.. ఈ ఏడాది ద్వితీయార్ధంలో ముగిసే వీలున్నది. '100 శాతం ఏటీసీ ఇండియాని సొంతం చేసుకోవడానికి సంబంధించి ఓ ఒప్పందం కుదిరింది' అని బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ అయిన డాటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ (డీఐటీ) శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో ప్రముఖ టెలికం మౌలిక సదుపాయాల కల్పన సంస్థగా ఉన్న ఏటీసీ ఇండియాకు దేశవ్యాప్తంగా దాదాపు 78,000 టవర్లున్నాయి. బ్రూక్‌ఫీల్డ్‌కూ దాదాపు 1,75,000 టవర్లున్నాయి. 2020లో రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ నుంచి దక్కించుకున్న సంగతి విదితమే.

స్విచ్, సాకెట్లకూ బీఐఎస్ తప్పనిసరి

నాణ్యత లేకపోతే జైలు, జరిమానా • నిబంధనావళిని విడుదల చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 5: స్విచ్‌లు, సాకెట్లు, కేబుల్స్ తదితర ఎలక్ట్రికల్ యాక్ససరీస్‌కూ నాణ్యతను తప్పనిసరిచేస్తూ కేంద్ర ప్రభుత్వం నిబంధనల్ని విడుదల చేసింది. విదేశాల నుంచి దిగుమతవుతున్న నాసిరకం ఉత్పత్తులను అడ్డుకోవడం, దేశీయంగా ఉత్పత్తిని పెంచుకోవడమే లక్ష్యంగా ఈ క్వాలిటీ నియమావళిని తీసుకురాగా.. ఈ మేరకు ఈ నెల 1నే పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) ఎలక్ట్రికల్ యాక్ససరీస్ (క్వాలిటీ కంట్రోల్) ఆర్డర్ 2023ని జారీ చేసింది. జూలై 1 నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి రానుండగా, వీటి ప్రకారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) మార్క్ లేని వస్తూత్పత్తులను తయారు చేసినా, అమ్మినా, దిగుమతి చేసుకున్నా, నిల్వ చేసుకున్నా నేరంగా పరిగణించనున్నారు.

ఎంఎస్ఎంఈల కోసం..

దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు ఈ నిబంధనల నుంచి కేంద్రం కొంత సడలింపునిచ్చింది. నిబంధనల అమలుకు ఎస్ఎంఈలకు అదనంగా 9 నెలలు, సూక్ష్మ సంస్థలకు ఏడాది సమయం ఇస్తున్నామని ఈ సందర్భంగా డీపీఐఐటీ తెలిపింది. దీని ప్రకారం వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఎస్ఎంఈలు, జూలై 1 నుంచి సూక్ష్మ సంస్థలు నిబంధనల్ని తప్పనిసరిగా అనుసరించాలి. ఆయా సంస్థల రక్షణార్థమే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈలోగా ఎంఎస్ఎంఈలు తమ తయారీ వ్యవస్థల్ని అప్‌డేట్ చేసుకోవాలన్నది. ఆపై బీఐఎస్ మార్క్‌తోనే ఉత్పత్తి చేయాలని స్పష్టం చేసింది.

కఠిన శిక్షలు

బీఐఎస్ చట్టం నిబంధనల్ని తొలిసారి ఉల్లంఘించినట్టు గుర్తిస్తే.. రెండేండ్ల వరకు జైలుశిక్ష, కనీసం రూ.2 లక్షల జరిమానా ఉంటుంది. రెండోసారి ఇదే నేరానికి పాల్పడినట్టు రుజువైతే.. జైలుశిక్షతోపాటు కనీసం రూ.5 లక్షల జరిమానా వేస్తారు. అలాగే గరిష్ఠంగా నిబంధనల్ని మీరి తయారు చేసిన వస్తూత్పత్తుల విలువకు 10 రెట్లు ఫైన్ వసూలు చేస్తారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు, వెల్డింగ్ రాడ్లు, ఎలక్ట్రోడ్స్, కుక్‌వేర్, సీలింగ్ ఫ్యాన్లు, వంట గ్యాస్ స్టౌవ్‌ల వంటి వాటికి ఈ నిబంధనల్ని తప్పనిసరి చేసిన సంగతి విదితమే.

కేంద్ర ఖజానాకు 60,000 కోట్లు

పీఎస్‌యూల నుంచి భారీ డివిడెండ్లు

న్యూఢిల్లీ, జనవరి 5: నిధులు లేక సతమతమవుతున్న కేంద్ర ప్రభుత్వానికి శుభవార్త ఇది. ఈ ఏడాది ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) కేంద్రానికి భారీ డివిడెండ్లను చెల్లిస్తాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. బడ్జెట్‌లో నిర్దేశించిన అంచనాల్ని మించి చెల్లింపు ఉంటుందని పేర్కొన్నాయి. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌యూల నుంచి రూ.55,000 కోట్ల నుంచి రూ. 60,000 కోట్ల వరకూ డివిడెండ్లు వస్తాయని ఆ వర్గాలు వివరించాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా రూ.43,000 కోట్ల డివిడెండ్ మొత్తాన్ని బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యానికి మించి ఈ ఏడాది అదనంగా రూ.12,000-17,000 కోట్లు వస్తాయని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పీఎస్‌యూల నుంచి రూ. 43,800 కోట్ల డివిడెండు మొత్తం కేంద్రానికి అందింది. పీఎస్‌యూల డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా వచ్చే నిధుల్లో భారీగా తగ్గనున్న నేపథ్యంలో ఆ లోటును డివిడెండ్లు పూడుస్తాయని భావిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యంలో కోత

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ సంస్థల వాటాల విక్రయిం ద్వారా కేంద్రానికి ఒనగూడే మొత్తంలో భారీ కోత పడనుంది. డిజిన్వెస్ట్‌మెంట్‌తో రూ. 51,000 కోట్లు సమీకరించాలని బడ్జెట్‌లో నిర్దేశించుకోగా, 30,000 కోట్లు కూడా రావడం కష్టమని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ వాటాల విక్రయంతో రూ.10,500 కోట్లు మాత్రమే కేంద్రం సమీకరించగలిగింది. ప్రస్తుతం 8 ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయ ప్రతిపాదన వివిధ దశల్లో ఉన్నది. అవి..ఐడీబీఐ బ్యాంక్, బీఈఎంఎల్, షిప్పింగ్ కార్పొరేషన్, హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్, ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా, ఇండియన్ మెడిసిన్స్ ఫార్మాస్యూటికల్ కార్పొరేషన్,ఫెర్రో స్క్రాప్ నిగమ్‌లు. వీటి వాటా విక్రయానికి ఇంకా సమయం పడుతుందని అంచనా. మరో పీఎస్‌యూ కంటైనర్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఇప్పటివరకూ ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్‌ను సైతం ఆహ్వానించలేదు